క్లుప్తంగా

ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన జూపూడి



మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న జూపూడి

సదుం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు జూపూడి ప్రభాకరరావు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని రామాపురంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొని వెళ్తున్న ఎంపీని బూరగమంద క్రాస్ వద్ద జూపూడి కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలు చర్చించారు. పలువురు దళిత సంఘం నాయకులు ఉన్నారు.

వైభవంగా ఉబ్బదేవర్లు



పుంగనూరులో ఉబ్బదేవర్ల ఊరేగింపు

పుంగనూరు: పట్టణంలోని రజకులు ఉబ్బ దేవర్ల పూజలను వైభవంగా జరిపారు. అమ్మవారిని పట్టణంలో ఊరేగింపు నిర్వహించి గంగమ్మ, వీరభద్రస్వామికి పూజలు చేసి, బలులు సమర్పించారు. ఈ సందర్భంగా విందు భోజనాలతో కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో వేడుకలు జరుపుకున్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పుంగనూరు: పట్టణంలోని లీనార్డ్ హైస్కూల్‌లో ఆదివారం వారాహి గ్రూపు సంస్థ నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరుకు చెందిన వైదేహి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో గుండె, కిడ్నీలు, ప్లాస్టిక్ సర్జరీ, యూరియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ రోగాలకు చికిత్స అందించారు. శిబిరంలో 80 మంది చికిత్స చేసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని హేమంత్‌రాయల్ తెలిపారు.

కుప్పం బస్సు.. కునికి పాట్లు



ఆర్టీసీ బస్సును నెడుతున్న ప్రయాణికులు

గుడుపల్లె: కుప్పం నుంచి గుడుపల్లె మీదుగా సంగనపల్లె వెళ్లే ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు సంగనపల్లెలో ప్రయాణికులను ఎక్కించుకుని గుడుపల్లె క్రాస్ సమీపంలో ఆగిపోయింది. దీంతో కండక్టర్ సహా ప్రయాణికులు బస్సును కొంత దూరం నెట్టారు. కొంత దూరం వెళ్లి మళ్లీ ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాలం చెల్లిన బస్సులు నడపడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారం.. అవమానం!

- గ్రామాల్లో ఉత్సవ విగ్రహాల్లా సర్పంచులు
- అధికారం అంతా షాడో సర్పంచులదే
- వారికే ఉపాధి
- జేసీబీలతో పనులు చేసి బిల్లులు స్వాహా



బైరెడ్డిపల్లి మండలంలో జేసీబీతో పనులు చేసిన వాటినే ఉపాధి కూలీలు చేస్తున్న పనులు

పలమనేరు: గ్రామాల అభివృద్ధిలో అత్యంత కీలకమైన స్థానిక సంస్థలు కూటమి రాకతో నిర్వీర్యమయ్యాయి. గ్రామ పంచాయతీ స్థాయిలోని సర్పంచులు, ఎంపీటీసీలు కూటమి పాలనలో నామమాత్రంగా మారిపోయారు. రాష్ట్రంలో 95శాతం మంది స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు. ఈనేపథ్యంలో పలమనేరు నియోజకవర్గంలో ఉపాధి పనులు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండానే కూటమి నేతల జేబులు నింపే ఏటీఎంలుగా మారిపోయాయి.

ఉపాధి ఎలా జరగాలంటే...

ఆయా గ్రామంలో ఉపాధి పనులు జరగాలంటే గ్రామసభలను నిర్వహించి అవసరమైన పనులను గుర్తించాలి. ఆపై జాబ్ కార్డున్న వారికి అందులో పనులు కల్పించాలి. ఈ తీర్మానాన్ని సంబంధిత పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు ఆమోదించాలి. ఆపై ఉపాధి అధికారులు పనులు పర్యవేక్షిస్తూ పనులు చేపట్టి వాటిని మస్టర్‌లో నమోదు చేస్తూ జీపీఎస్ ఆధారంగా బిల్లులు పెట్టాలి. కానీ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులుండడంతో కూటమి ప్రభుత్వం తీర్మానాలతో పనిలేకుండా ఆ పార్టీ నేతలకు ఉపాధి పనులను మంజూరు చేస్తున్నారు. ఇదేమని స్థానిక సర్పంచులు అడిగితే తమకు కొత్త జీఓ వచ్చిందని ఇకపై సర్పంచులతో అసలు పనిలేదని ఉపాధి అధికారులు చెబుతున్నారు.

ఇప్పుడు సాగుతున్న పనులిలా...

ప్రస్తుతం ఈజీఎస్ ద్వారా హార్టికల్చర్‌లో మొక్కలు నాటడం, సప్లై చానళ్లు, ఫాంపాండ్స్, వెటర్నరీ శాఖ ద్వారా క్యాటిల్ షెడ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ఈ పనులను ఆయా మండలాల ఈజీఎస్ అధికారులు సర్పంచులకు తెలియకుండానే ఆయా మండల కూటమి నేతల సిఫారసులు ఉన్న వారికి కేటాయించేశారు. పనులు దక్కించుకున్న వారు వీటిని జేసీబీ వాహనాల ద్వారా చేపట్టి ఉపాధి సిబ్బంది మద్దతుతో దోపిడీ సాగిస్తున్నారు. నియోజకవర్గంలో ఈ ఆరునెలల్లో రూ.5కోట్ల దాకా పనులు జరగ్గా ఇందులో రూ.4కోట్ల దాకా అక్రమాలు సాగినట్టు సమాచారం

పలమనేరు నియోజకవర్గంలో...	
మొత్తం మండలాలు	: 5
మొత్తం పంచాయతీలు	: 90
మొత్తం గ్రామాలు	: 520
ఈదఫా ఈజీఎస్ బడ్జెట్	: రూ.5కోట్ల దాకా

మాదేమీ లేదు..అంతా వారిదే..



మేము వైస్ సర్పంచ్‌గా ఉన్నామేగాని మా పంచాయతీలో ఉపాధి పనులు మొత్తం కూటమి నేతలే చేసుకుంటున్నారు. అవి కూడా యంత్రాలను పెట్టి చేస్తున్నా వాటికి ఉపాధి అధికారులు బిల్లులు చేస్తున్నారు. కనీసం పంచాయతీలో సర్పంచ్, ఎంపీటీసీలను కూటమి నేతలే కాదు అసలు అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. –నరసింహారెడ్డి, వైస్ సర్పంచ్, కొలమాసనపల్లి

కూటమిలో లోకల్‌బాడీస్ వేస్ట్..



కూటమి ప్రభుత్వంలో ఆయా సర్పంచులుగానీ, ఎంపీటీసీలుగానీ ఎందుకూ పనికిరాకుండా పోయారు. కేవలం ఆయా ప్రాంతంలోని కూటమి నేతలు చెప్పినట్టు అధికారులు నడుచుకుంటున్నారు. అంత మాత్రానికి మేమంతా దేనికి ఈ వ్యవస్థనే రద్దు చేసి టీడీపీ నాయకుల ద్వారా ఉపాధి పనులు, మండల గ్రాంటుల ద్వారా అభివృద్ధి పనులు చేసుకుంటే పోలే. –గజేంద్ర, వైస్ ఎంపీపీ, పలమనేరు

పలమనేరు క్రికెట్ సంఘ అధ్యక్షుడిగా రంజిత్‌షా



పలమనేరు నూతన క్రికెట్ సంఘం

పలమనేరు: పలమనేరు క్రికెట్ సంఘ అధ్యక్షుడిగా రంజిత్‌షా ఎన్నికయ్యారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. సంఘ ఉపాధ్యక్షులుగా హరిక్రిష్ణ, సాయిప్రతాప్, మన్సూర్, కిషోర్, కార్యదర్శిగా సుబ్రమణ్యం, కోశాధికారిగా గిరిబాబు, సంయుక్త కార్యదర్శులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు, కమిటీ మెంబర్లను ఎన్నుకున్నట్టు తెలిపారు. పలమనేరులో క్రికెట్ అభివృద్ధికి తమ సంఘం శాయశక్తులా కృషి చేస్తుందని వారు తెలిపారు.

ముసురు వర్షం

సదుం: మండలంలో పలుచోట్ల ఆదివారం ఉదయం నుంచి ముసురు వర్షం కురిసింది. మధ్యాహ్నానికి వర్షం తెరపిచ్చింది. వర్షం మామిడి పంటకు తీవ్ర నష్టం చేకూరుస్తుందని రైతులు తెలిపారు. ఇప్పటికే తేమ కారణంగా మామిడి తోటల్లో పూత రాలేదు. ఇందు కోసం వేల రూపాయలు వ్యయం చేసి మందులు పిచికారీ చేస్తున్నారు. మళ్లీ వర్షం పడడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేమన పద్యాలు సమాజానికి సోపానాలు



పలమనేరు మార్కెట్ కమిటీ వద్ద వేమనకు నివాళులర్పిస్తున్న వైవీఆర్ నేతలు



రోగి తండ్రికి ఆర్థికసాయం చేస్తున్న ట్రస్టు సభ్యులు

- ఘనంగా యోగి వేమన జయంతి వేడుకలు

పలమనేరు: వేమన పద్యాలు సమాజానికి మేలు కొలిపే సోపానాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆమేరకు పలమనేరులో ప్రజాకవి వేమన 613వ జయంతి వేడుకలు యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్టు, బైపాస్ రోడ్డులోని వేమన విగ్రహంతో పాటు ప్రభుత్వం అధికారికం స్థానిక మున్సిపల్ కార్యాలయాల్లో ఆదివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఏఎంసీ సర్కిల్ వేమన విగ్రహం వద్ద వేమన జయంతి వేడుకలను యోగి వేమన చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు చెంగారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బైరెడ్డిపల్లి మండలం ఓబుల్‌రెడ్డి కుమార్తెకు ఆర్థికసాయాన్ని అందించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానాలు, వైవీఆర్ క్యాలెండర్ల ఆవిష్కరణ, పేదలకు దుప్పట్ల పంపిణీ, ఆస్పత్రి పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. ఇదే కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అక్కడి అధికారులతో కలసి అధికారికంగా నిర్వహించారు. ఇదే కార్యక్రమాన్ని స్థానిక బైపాస్ రోడ్డు వద్ద వేమన విగ్రహానికి పూజలు నిర్వహించి టీడీపీ నేతలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన పద్యాలను చెప్పిన పిల్లలకు బహుమతులను అందజేశారు. ఆపై కవులు, రచయితలైన రెడ్డిప్రకాష్ అశోక్, పలమనేరు బాలాజీ, కుమారస్వామి రెడ్డి, గండికోట వారిజ, మల్లిచెట్ల దేవేంద్ర, సహజకవి బాలక్రిష్ణలను టీడీపీ నేతలు పల్లెరుచులు అమరనాథ రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కిశోర్‌గౌడ, సుబ్బన్న సన్మానించారు. వైవీఆర్ ట్రస్టు అధ్యక్షుడు చెంగారెడ్డి,ఆర్ శ్రీనివాసులు రెడ్డి, బాలాజీరెడ్డి, కొండారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, నక్కపల్లి భాస్కర్‌రెడ్డి, గిరిరాజారెడ్డి పాల్గొన్నారు.

రచనలు ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కార పోటీకి రచనలు ఆహ్వానిస్తున్నట్లు అధ్యక్షురాలు రోజాప్రియ తెలిపారు. రచనలను కె.రామలక్ష్మి, నర్సింగ్‌హోమ్, చిత్తూరు అనే చిరునామాకు పంపాలని పేర్కొన్నారు.

వాసవీక్లబ్ అధ్యక్షురాలిగా రమ్య



నూతన వాసవీక్లబ్ సభ్యులు

పలమనేరు: పలమనేరు వాసవీక్లబ్ అధ్యక్షురాలిగా రమ్య ఎంపికైంది. ఆర్యవైశ్య సంఘ నాయకులు సుభాష్ చంద్రబోష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వంటగది మరమ్మతులకు తమ వంతు సాయం చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఆత్మీయ 'స్పర్శ'



స్విట్జర్లాండ్

కుష్టు.. ఒకప్పుడు దేశాన్ని వణికించిన వ్యాధి.. ఈ మహమ్మారి సోకి.. తొలిదశ దాటితే నయం కావడం కష్టం.. అలాంటి వారిని ఎందరో మహనీయులు అక్కున చేర్చుకుని ఆత్మీయ స్పర్శ అందిస్తున్నారు. ప్రభుత్వం కూడా స్పర్శ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తూ సేవలందిస్తోంది. ఈ నెల 29న కుష్టువ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- 29న ప్రపంచ కుష్టువ్యాధి నివారణ దినోత్సవం

పలమనేరు: సమాజంలో సమానత్వం పెంపు.. ఐకమత్య సాధనకు ఎన్నో ఉద్యమాలు జరిగిన రోజుల్లో ప్రజలందరినీ వణికించిన అంశం కుష్టు వ్యాధి. వ్యాధిగ్రస్తులను ఇంటా, బయటా దూరంగా ఉంచే దుష్పరిణామాలు అప్పట్లో యావత్ దేశానికి ఆందోళన కలిగించాయి. మహాత్మగాంధీ, మదర్ థెరిసా వంటి మానవతామూర్తులు కుష్టుత వ్యాధిగ్రస్తులను అక్కున చేర్చుకుని, విద్య, వివాహాలకు వారు కూడా అర్హులేనని చాటి చెప్పారు. ప్రజలను అంత ఇబ్బంది పెట్టిన కుష్టు వ్యాధి ప్రస్తుతం చాలా వరకు జిల్లాలో తగ్గుముఖం పట్టింది. కుష్టువ్యాధి సంపూర్ణ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, విదేశీ సంస్థలు పటిష్టంగా కృషి చేస్తున్నాయి. ఈనెల 29న ప్రపంచ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం జరుపుకుంటున్నాం. ప్రభుత్వం కుష్టు వ్యాధి నిర్మూలనకు స్పర్శ అనే కార్యక్రమం అమలు చేస్తోంది.

కుష్టు నివారణలో పలమనేరు ఇమ్మాస్ సేవలు ఘనం

పలమనేరు సమీపంలోని ఇమ్మాస్ స్విస్ లెప్రసీ సెంటర్ రాయలసీమ, కర్ణాటకలోని కోలారు జిల్లా వాసులకు దశాబ్దాలుగా సేవలందిస్తోంది. 1977లో ఇక్కడ స్విట్జర్లాండ్ ప్రభుత్వం కుష్టు నివారణకు శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు ఇక్కడ సుమారు 50 వేల మంది రోగులకు చికిత్స అందించారు. ప్రస్తుతం డాక్టర్ అబూమ్ జాకోబ్, ఆయన సతీమణి క్యాథలిన్ జాకోబ్ ఇక్కడే ఉంటూ రోగులకు సేవలందిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

రామకుప్పం: మండలంలో ఆదివారం పురుగుల మందుతాగి ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. గెర్నిపల్లికి చెందిన రషీద్(35) తన భార్యకు అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్లు మసీదులో ఫిర్యాదు చేశాడు. విచారించిన జమాత్ పెద్దలు వివాహేతర సంబంధం పెట్టుకున్న యువకునికి రూ.25 వేలు జరిమానా విధించారు. ఈక్రమంలో ఆ యువకుని తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూడగా పిల్లనివ్వడానికి ఎవరూ అంగీకరించలేదు. దీనికి రషీద్, అతని భార్య కారణమని, రూ.లక్ష చెల్లించాలని పెద్ద మనుషులు హుకుం జారీ చేశారు. ఈ విషయంపై రషీద్ పెద్ద మనుషులపై రామకుప్పం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు వారిని స్టేషనుకు పిలిపించి పంచాయితీ చేసి జరిమానా విధించే అధికారం ఎవరికీ లేదన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మనస్తాపానికి గురైన రషీద్ రామకుప్పం పోలీస్‌స్టేషన్ ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన పోలీసులు అతన్ని స్థానిక పీహెచ్‌సీకి, అక్కడి నుంచి కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.

శ్రీమారెమ్మకు దేవదాయశాఖ గ్రహణం



మారెమ్మ ఆలయం



అలంకరణలో మారెమ్మ

- ఏటా రూ.25 లక్షలకు పైగా ఆదాయం
- వేలాదిగా వస్తున్న భక్తులు
- దేవదాయశాఖలో చేర్చుతూ 1988లో గెజిట్
- పట్టించుకోని అధికారులు

పుంగనూరు: పది దశాబ్దాల క్రితం చిన్న ఆలయంగా వెలసిన శ్రీమారెమ్మ గుడికి వేలాది మంది భక్తులు, లక్షలాది రూపాయలు ఆదాయం వస్తుంటుంది. ఆలయం అభివృద్ధి చెందడంతో దేవదాయశాఖ పరిధిలోకి ఆలయాన్ని 1988 సంవత్సరంలో చేర్చుకున్నా ఆధీనం చేసుకునేందుకు దేవదాయ శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు చేసేందుకు ఆలస్యం చేస్తుండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆలయం ఏర్పాటు...

పట్టణంలోని నడిబొడ్డున గల ఎంబీటీ రోడ్డు జాతీయ రహదారిపై శ్రీమారెమ్మ ఆలయం పది దశాబ్దాల క్రితం చిన్న గుడిగా ఉండేది. ఇక్కడ నాగదేవతలు, శ్రీ ఓంశక్తి అమ్మవారి ఆలయాన్ని కూడా నిర్మించారు. ఆలయంలో పగడాల కుటుంబసభ్యులు నిరంతరం పూజలు చేసేవారు. ఇక్కడ ఉన్న డాక్టర్ దామోదర్‌నాయర్, తుంగా, నానబాల కుటుంబసభ్యులు కలసి ప్రజల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. నేడు వేలాది మంది భక్తులు రాకతో అమ్మవారి ఆదాయం నేడు రూ.25 లక్షల వరకు ఉందని అధికారులు నివేదికలు పంపారు. అలాగే అమ్మవారికి చెంగలాపురం, మేలుపట్ల ప్రాంతాల్లో 2.38 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం కోట్లాది రూపాయలు విలువ చేసే భూమిని జమీందారులు శ్రీ మారెమ్మకు ఇనాంగా ఇచ్చినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

అమావాస్య, రాహుకాల పూజలు

పట్టణంలోని శ్రీమారెమ్మ ఆలయంలో అమావాస్య, రాహుకాల పూజలు, గంగజాతర, ఓంశక్తి అమ్మవారి మాలధారణ పూజలు విశేషంగా నిర్వహిస్తారు. అలాగే ప్రతియేటా శ్రీసుగుటూరు గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారి ఆలయంలో కూడా రెండు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ప్రతి శుక్ర, మంగళవారాల్లో అమ్మవారిని వేలాది మంది దర్శించుకుని, జంతు బలులు సమర్పిస్తారు. అమావాస్య రోజు గుమ్మిడికాయ, నిమ్మకాయలు, పచ్చిమిరపకాయలు కట్టి దిష్టినివారణ పూజలు నిర్వహించి, వాటిని ఇళ్ల గుమ్మాలకు కడితే శుభం కలుగుతుందని ప్రతీతి. దీని ద్వారా ఆలయానికి వేలాది రూపాయలు ఆదాయం లభిస్తోంది.

1988లో స్వాధీనం..

పట్టణంలోని శ్రీమారెమ్మ ఆలయాన్ని 1988 సంవత్సరం డిసెంబర్ 22న ఎండోమెంట్ జాబితాలోకి చేర్చుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. దీనిపై అర్చకులు, పట్టణానికి చెందిన కొంత మంది కోర్టుకు వెళ్లి ఆలయం ప్రైవేటు వారిదని, దేవదాయశాఖకు సంబంధం లేదని కేసులు దాఖలు చేశారు. దీనిపై 2010 సంవత్సరంలో హైకోర్టు ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని తీర్పునిచ్చింది. లక్షలాది రూపాయలు ఆదాయం ఉన్న ఆలయాన్ని తీసుకోవడంలో దేవదాయశాఖాధికారుల పనితీరు విమర్శలకు దారితీస్తోంది.

బైపాస్‌కు మోక్షం!





బైపాస్ రోడ్డు నిర్మించనున్న మండల కేంద్రాలు వి.కోట, బైరెడ్డిపల్లి

- బైరెడ్డిపల్లి, వి.కోటలకు బైపాస్ పనులు
- ఇప్పటికే భూసేకరణ
- రూ.70 కోట్లు మంజూరు
- త్వరలో ప్రారంభం కానున్న పనులు

పలమనేరు: నియోజకవర్గంలోని మండల కేంద్రాలైన బైరెడ్డిపల్లె, వి.కోటలో బైపాస్ రోడ్ల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఆమేరకు రోడ్డు రవాణా, రహదారులశాఖ) చర్యలు చేపడుతోంది. ఇప్పటికే భూసేకరణ, అభ్యంతరాలు, ఆక్షేపణలు సైతం పూర్తయ్యాయి. తాజాగా స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సైతం బైపాస్ రోడ్ల పనుల ప్రారంభంకానున్నాయని వి.కోటలో తెలిపారు.

రూ.70కోట్లతో బైపాస్ రోడ్లు

చిత్తూరు జిల్లాలో బైపాస్‌రోడ్ల నిర్మాణానికి గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.290 కోట్లను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఇందులో వి.కోట, బైరెడ్డిపల్లి మండల కేంద్రాలకు బైపాస్ రోడ్ల భూసేకరణ, నిర్మాణానికి రూ.70 కోట్లను వెచ్చించనున్నారు. బైరెడ్డిపల్లి వద్ద మరవంక నుంచి వి.కోట రహదారిలోని ఆంజనేయస్వామి ఆలయం దాకా 6కిలోమీటర్లు, వి.కోటలో నెర్నిపల్లి సమీపం నుంచి తూర్పువైపు 10 కిలోమీటర్లు బైపాస్ రోడ్ల నిర్మాణం జరగనుంది. గతంలో వి.కోట నుంచి పడమటి వైపు కర్ణాటక రాష్ట్ర భూభాగంలో సైతం బైపాస్ వెళ్లేలా సర్వే జరిగింది. కానీ అక్కడి స్థానికుల అభ్యంతరాలతో ఇప్పుడు అక్కడ బైపాస్ మార్గం తూర్పువైపునే చేపడుతున్నట్టు రెండ్రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు గతంలో ఇచ్చిన అంచనాలను సైతం పెంచే అవకాశం ఉంటుందనే మాట ఇప్పుడు వినిపిస్తోంది.

బైరెడ్డిపల్లెలోనూ రోడ్డు విస్తరణ పనులు

బైరెడ్డిపల్లె, వి.కోట మండల కేంద్రాల్లో రోడ్లు మరీ ఇరుకుగా ఉన్నాయి. దీంతో పలు దుకాణాలు, భవనాలను కూల్చివేయాలని గతంలో హైవే అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన సర్వే చేసి భవనాలకు మార్కింగ్‌లు ఇచ్చేశారు. బైరెడ్డిపల్లెలో రోడ్డుకిరువైపులా ఉన్న వ్యాపారులు, యజమానులు పలుమార్లు జిల్లా అధికారులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో రోడ్డు విస్తరణ అప్పట్లో ఆగింది. కానీ కూటమి ప్రభుత్వంలో ఈ పనులు త్వరలోనే చేపట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

వామ్మో.. కల్తీ మిరియాలు !

చౌడేపల్లి: ఘుమఘుమలాడే వంటల కోసం వినియోగించే మిరియాలను కొని కొనుగోలు చేస్తే మోసపోవడం ఖాయం. సాధారణంగా కిలో మిరియాల ధర రూ.700 నుంచి రూ.800 ధర ఉంటుంది. వ్యాపారులు మిరియాల్లోకి అటవీప్రాంతంలో పండే నెమలి ఊడగ గింజలు అచ్చం మిరియాల్లాగే ఉంటాయి. వాటిని గిరిజనుల నుంచి కిలో వంద చొప్పున కొనుగోలు చేసి ఎండబెట్టి మిరియాల్లో కల్తీ చేసి దర్జాగా విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.



కల్తీకి వాడుతున్న నెమిలిఊడగ గింజలు